ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి
# జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | శుక్రవారం | 28.08.2026 | సంపుటి : 2 | సంచిక : 56 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్



నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల
## గల్లంతు
విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య
సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్ 04



## రాఖీ పౌర్ణమి..
అన్నా చెల్లెళ్ల ప్రేమకు ప్రతీక 04

# మీరాలం చెరువుకు మహర్దశ

### పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
### ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం
### పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మీరాలం చెరువు చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మీరాలం చెరువుపై సస్పెన్షన్ బ్రిడ్జిని రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. భారీ క్రేన్ పై నుంచి మీరాలం చెరువు పనులను పరిశీలించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని, చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మీరాలం నుంచి మూసీలోకి వరద వెళ్లేలా నాలాను విస్తరించాలన్నారు. వాటర్ స్పోర్ట్స్ కోసం డిజైన్ ఏర్పాటు చేయాలని, మీరాలం చెరువులో ఉన్న ఐ ల్యాండ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఇక్కడికి పర్యాటకులను రప్పించేలా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు.



హైదరాబాద్, ఆగస్ట్ 27 : హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీరాలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దబోతోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు, వినోదాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మీరాలం చెరువును అకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు, సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన సీఎం, పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 (50.18 శాతం) పైల్స్ పూర్తి కాగా,

-మిగతా 2 లో..



# ఖేలో ఇండియా సంవాద్

### దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం
### క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 27 : దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్

-మిగతా 2 లో..

# భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు
పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం 03
పనిమనిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు
కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు




వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది.



# ఏఐసీసీ పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

### అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం
### కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదన్న మహేశ్ గౌడ్

నిజామాబాద్, ఆగస్ట్ 27 : మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు

-మిగతా 2 లో..

# లోక్‌సభ నియోజకవర్గాలు యథావిధిగా కొనసాగాలి

### ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
### ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
### తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్

లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు.



న్యూఢిల్లీ, ఆగస్ట్27 : ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

### గనులశాఖ ఏడీ జయరాజుపై
# ఏసీబీ కొరడా

ఆదాయానికి మించిన ఆస్తుల ఫిర్యాదు.. ఏకకాలంలో 8 చోట్ల సోదాలు

మూడు కార్లు, 629 గ్రాముల బంగారం.. రూ.3.06 కోట్ల ఆస్తుల గుర్తింపు



గనులు, భూగర్భ శాఖలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) గురువారం కొరడా ఝుళిపించింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం వరంగల్ మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్‌గా అడిషనల్ చార్జ్‌లో ఉన్న బొజ్జ జయరాజుపై కేసు నమోదు చేసింది. గురువారం మొత్తం 8 చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఇప్పటివరకు గుర్తించిన స్థిర, చరాస్తుల విలువ సుమారు రూ.3,06,53,177గా ఏసీబీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

03



# ఆటో డ్రైవర్లకు శుభవార్త

### ఇవి పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం
### 200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ జివో జారీచేసిన తెలంగాణ

హైదరాబాద్, ఆగస్ట్ 27 : ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026'ను అమలు

-మిగతా 2 లో..

# జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

### 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు
### వివరాలను వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ




న్యూఢిల్లీ, ఆగస్ట్ 27 : దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

-మిగతా 2 లో..



## ఏఐసీసీ పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

(మొదటిపేజీ తరువాయి)

క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



## యథావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు కొనసాగాలి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.




## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్–ఆధార్– మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి నిబంధన విధించారు.

# మీరాలం చెరువుకు మహర్దశ

(మొదటిపేజీ తరువాయి)

62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు , ఐలాండ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా చెరువులోకి ఎలాంటి మురుగు నీరు చేరకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. యువతతో పాటు కుటుంబాలను ఆకట్టుకునేలా మిర్ ఆలం చెరువులో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలను అందుబాటులోకి తేనున్నారు. పర్యావరణ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు , వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు కానున్నాయి. అంతేకాకుండా, చెరువులో ఉన్న ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లు వేసుకునే గ్లాంపింగ్ స్పాట్లుగా , డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు. ఈ నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానికులకు ఉపాధి కల్పిస్తారు. సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. దీనివల్ల జూ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు ,



కుటుంబ వినోదాన్ని పొందగలుగుతారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మిర్ ఆలం ట్యాంక్ ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారనుంది.

## కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి

### హరీశ్‌రావు

**హనుమకొండ:** పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకు ముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.



## మంగళగిరికి కూడా అమరావతి నుంచే నీరు

### సిఆర్‌డిఏ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి నారాయణ

**అమరావతి,ఆగస్ట్27:** మంగళగిరికి రాజధాని అమరావతి నుంచి తాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 65వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న వివిధ పరిపాలన అనుమతులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఆ వివరాలను మంత్రి నారాయణ వివరించారు. 06.01.2026 ముందు వరకూ లోన్లు తీసుకున్న రెండో దశ భూసమీకరణ రైతులకు కూడా రుణ మాఫీ వర్తింప చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారని మంత్రి నారాయణ వివరించారు. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్‌కు ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి చెప్పారు. మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు. ఎల్‌పీఎస్ రోడ్లను సీసీకి బదులు బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29 గ్రామాల లే ఔట్ రోడ్లు బీటీగా మార్చేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన వివరించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా అంగీకారం తెలిపామని అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐవోసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## ఖేలో ఇండియా సంవాద్

(మొదటిపేజీ తరువాయి)

చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అథ్లెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.



## ఆటో డ్రైవర్లకు శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఇవిలుగా మార్చే పక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

**సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే 14 శాతం లోటు**

**ఇప్పటివరకు కురవాల్సిన వాన 53.78సెం.మీ.**

**16 జిల్లాల్లో సాధారణం, 15 జిల్లాల్లో లోటు వర్షాలు**

**వర్షాభావ పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్ మూడో వంతు ముగుస్తున్నా వర్షాలు మాత్రం ఆశాజనకంగా కురవడం లేదు. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తుగా అంచనాలు విడుదల చేసింది. ఈక్రమంలో సీజన్ మొదట్నుంచీ రాష్ట్రంలో అత్తెసరు వర్షాలే కురుస్తున్నాయి.**



**హైదరాబాద్:** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు 53.78 సెంటీమీటర్ల సగటు వర్షపాతం కురవా ల్సి ఉండగా ఇప్పటివరకు 46. 47 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణం కంటే 14 శాతం లోటు వర్షపాతం ఉంది. సీజన్‌లో ఇప్పటివరకు భారీ వర్షాలు నమోదు కా లేదు. రుతుపవనాల కదలికలు చురుకుగా ఉన్నప్పటికీ వేగంగా వీస్తున్న గాలుల ప్రభావంతో వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడడంలేదని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు తేలికపాటి వర్షాలే నమోదయ్యాయి. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసినప్పటికీ ఎక్కువ ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులున్నాయి. ఇప్పటివరకు 15 జిల్లాల్లో 20 శాతం కంటే అధికంగా లోటు వర్షపాతం నమోదైంది. మరో 16 జిల్లాల్లో వర్షపాతం సాధారణమని వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ ఇందులోనూ చాలా జిల్లాల్లో 10 నుంచి 15శాతం లోటు ఉన్న జిల్లాలు ఆరు జిల్లాలున్నాయి. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం తీరును పరిశీలిస్తే... కేవలం రెండు మండలాల్లో మాత్రమే అత్యధిక వర్షపాతం నమోదైంది. 73 మండలాల్లో అధిక వర్షపాతం, 269 మండలాల్లో సాధారణ వర్షపాతం, 273 మండలాల్లో లోటు వర్షపాతం, నాలుగు మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో వర్షాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని, ఈ నెల రెండో వారం నుంచి ఇప్పటివరకు వర్షాలు అత్యంత పరిమితంగానే ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షానికి అనుకూల వాతావరణం ఏర్పడడం లేదని, రుతుపవనాలు విరామదశలో ఉన్నట్లు పేర్కొంటున్నారు. రానున్న పది రోజుల వరకు వర్షాలు తక్కువగా నమోదవుతాయని అభిప్రాయపడుతున్నారు. సెప్టెంబర్‌లో బంగాళాఖాతంలో ఒకటి రెండు బలమైన అల్పపీడనాలు ఏర్పడితే పరిస్థితి పూర్తిగా మారవచ్చని, సెప్టెంబర్ 10వ తేదీ తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ అల్పపీడనం పశ్చిమ/వాయవ్య దిశలో కదిలితే రాష్ట్రంలో వర్షాలకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

- పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు
- పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం
- పనిమానిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు
- కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు



**బెంగళూరు,ఆగస్ట్27 :** వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకు రూ.150 చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.

## ఫోన్ వాడొద్దన్న తండ్రి.. బాలిక ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్ట్ 27 :** తండ్రి మందలించాడనే మనస్తాపంతో ఓ బాలిక కఠిన నిర్ణయం తీసుకుంది. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి ప్రాణాలు తీసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడకు చెందిన ఓ బాలిక అస్తమానం ఫోన్‌లో గడిపేది. ఇది గమనించిన తండ్రి.. పలుమార్లు ఆమెను మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలిక.. ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత గురువారం ఉదయం ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో శవమై తేలింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే బాలిక వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మైనింగ్ ఏజీ జయరాజు ఇళ్లపై ఏసీబీ దాడులు

### భారీగా నగదు, నగలు స్వాధీనం



**హైదరాబాద్, ఆగస్ట్ 27 :** భాగ్యనగరంలో మరోసారి ఏసీబీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు ఇళ్లలో ఏసీబీ అధికారు లు తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజా ము నుంచే సోదాలు మొదలయ్యాయి. భూపాలపల్లితో పాటు హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు ప్రాంతాల్లోని 8 చోట్ల అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతున్నాయి. సోదాల్లో జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదు, బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్, ల్యాండ్ డాక్యుమెంట్లను గుర్తించి.. పరిశీలిస్తున్నారు. బ్యాంకులో రూ.60 లక్షల నగదు ఏసీబీ అధికారులు గుర్తించారు. అలాగే రెండు కార్లు, రెండు బైక్‌లు, జనగామలో ఐదు ఎకరాల భూమి ఏసీబీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. సోదాలపై ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్ మాట్లాడుతూ.. భూగర్భ జల గనుల శాఖ ఏడీ జయరాజు నివాసంలో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉదయం నుంచి జరుగుతున్న సోదాల్లో నలభై తులాల బంగారాన్ని గుర్తించామన్నారు. జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదుతో పాటు ఆయన బ్యాంకు ఖాతాలో నగదును కూడా గుర్తించామని చెప్పారు. జనగామలో జయరాజుకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని.. ఆయనపై ఏసీబీకి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లోనే నాలుగు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయని సాయి మనోహర్ తెలిపారు. తాండూరు, వరంగల్‌లోని జయరాజ్ సన్నిహితులు, బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు జరుగుతున్నాయని అన్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్‌తో పాటు రెండు కార్లు, రెండు బైక్‌లను కూడా గుర్తించామన్నారు. సాయంత్రం వరకు సోదాలు కొనసాగుతాయని.. సోదాల అనంతరం ఆయన అక్రమాస్తులపై క్లారిటీ వస్తుందని వెల్లడించారు. జయరాజ్ ఇటీవలే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతు న్న కొందరితో జయరాజ్ కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు గతంలో అనేకసార్లు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో అక్రమంగా ఆస్తులు కూడబెట్టరా..? అనే కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

## ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

### 80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు

### కన్నీటి పర్యంతం అయిని జగ్గీవాసుదేవ్



**చెన్నై, ఆగస్ట్ 27 :** ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజీ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటిపర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచుచరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

## హన్మకొండలో బీఆర్ఎస్ ధర్నా

### హరీష్ రావు అరెస్ట్‌తో పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు

**వరంగల్, ఆగస్ట్ 27 :** బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

- కడియంపై వ్యాఖ్యలపై కౌశిక్ రెడ్డికి నోటీసులు
- కౌశిక్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నంపై వేముల ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్ట్ 27 :** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఆగస్ట్ 29న అసెంబ్లీ కమిటీ హాల్1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా, 'ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిండు శాసనసభలో బడివే, పండబెట్టి తొక్కుతా, బట్టలూడదీసి కొడుతా, మా దగ్గర కండలు తిరిగినోళ్లున్నరు.. బోర్ల వేసి కొడ్తం.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పదికత్తులు లేస్తే మీ తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడుతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందికి రావా? అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై చర్చించి చర్యల సిఫార్సుకు ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటుచేసినట్టు నోటీసు వచ్చిందని, అయితే కౌశిక్ వ్యవహారాన్ని సిఫార్సు చేసిన సమయంలో ఎథిక్స్ కమిటీ మనుగడలో లేదని తెలిపారు. అసలు కమిటీ లేనప్పుడు ఆ వ్యవహారాన్ని ఎలా రెఫర్ చేస్తారని ప్రశ్నించారు. దీనిని బట్టి కక్ష సాధింపు చర్యగా అర్థమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం శ్రీహరి అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ ఆక్షేపించారని తెలిపారు.

## కేటీఆర్‌కు జిందాల్ వర్సిటీ ఆహ్వానం



**హైదరాబాద్, ఆగస్ట్ 27 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హర్యానాలోని ప్రముఖ ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ఆహ్వానం అందింది. విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించడంతో పాటు వారిని ఉద్దేశించి 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' ఇవ్వాలని యూనివర్సిటీ కేటీఆర్‌ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి.రాజ్‌కుమార్ ఈ మేరకు కేటీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచన లు, ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తా యని పేర్కొన్నారు. కేటీఆర్‌కు అనుకూలమైన తేదీ, సమయా న్ని బట్టి సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలను పంచుకుంటారని యూనివర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## మేమంతా క్షేమంగా ఉన్నాం: సతీష్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 27 :** భారీ వరదలతో నేపాల్ పరిసర ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. ఈ వరదల వల్ల వంద మందికిపైగా మరణించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక వందలాది మంది గల్లంతయ్యారు. వారిలో విదేశీయులు కూడా ఉన్నారు. ఆ జాబితాలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. దీంతో భారత్‌లోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర కలత చెందుతున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటికే రంగంలోకి దిగి వారి ఆచూకీ కోసం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో టిబెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి స్పందించారు. ఆయన తాము క్షేమంగా ఉన్నామని, తాము వరదల్లో చిక్కుకోలేదన్నారు. తాము ఉన్న ప్రాంతంలో వరదల ప్రభావం లేదని తెలిపారు. తామంతా క్షేమంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఆగస్టు 30వ తేదీన హైదరాబాద్ చేరుకుంటామని సతీష్ రెడ్డి చెప్పారు.



## గణేష్ ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలి

### హైదరాబాద్‌లో లక్ష మట్టి విగ్రహాలు ఉచితం

**హైదరాబాద్, ఆగస్టు 27 :** గణేష్ ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని జీహెచ్ఎంసీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఈ ఏడాది మొత్తం లక్ష మట్టి వినాయక విగ్రహాలను.. నగరవ్యాప్తంగా ఉచితంగా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. నిమజ్జనం కారణంగా నీటి వనరుల్లో కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యం. జీహెచ్ఎంసీ పరిధిలోని సర్కిల్, జోనల్ కార్యాలయాల ద్వారా సెప్టెంబర్ రెండో వారంలో ఈ మట్టి గణనాధులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. భక్తులతో పాటు కాలనీ సంక్షేమ సంఘాలు, గణేష్ మండపాల నిర్వాహకులు కూడా వీటిని పొందేందుకు అవకాశం కల్పించనున్నారు. మొత్తం లక్ష విగ్రహాలను మూడు సైజుల్లో సిద్ధం చేయనున్నారు. ఇందులో 70 వేల విగ్రహాలను 8 అంగుళాల ఎత్తులో.. 20 వేల విగ్రహాలను ఒక అడుగు ఎత్తులో, 10 వేల విగ్రహాలను 1.5 అడుగుల ఎత్తులో తయారు చేయనున్నారు.



## యశోదలో గవర్నర్‌కు సిఎం పరామర్శ

**హైదరాబాద్, ఆగస్ట్ 27 :** అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.

## 'ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్

**నిజాంసాగర్, ఆగస్టు 27 :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నిజాంసాగర్ మండల కేంద్రంలోని బంజేపల్లి గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన గ్రామసభలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ తదుపరి ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా చేపడుతున్న ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఏలే మల్లికార్జున్ పిలుపునిచ్చారు. ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, పేరు లేకపోయినా లేదా ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు ఉన్నా సంబంధిత బీఎల్ఓ, ఎఈఆర్ఓ, ఈఆర్ఓ అధికారులను సంప్రదించి అవసరమైన దరఖాస్తులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించుకోవాలని సూచించారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు, ఫారం 7 ద్వారా మరణించిన లేదా డూప్లికేట్ ఓటర్లపై అభ్యంతరాలు, ఫారం 8 ద్వారా మొబైల్ నంబర్, చిరునామా తదితర వివరాల సవరణలు చేసుకునే అవకాశం ఉందని ప్రజలకు వివరించారు. సర్ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 16వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే ప్రక్రియ కొనసాగుతుందని, అనంతరం అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే ఎస్ఐఆర్ హియరింగ్ సమయంలో బీఎల్ఏలు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, మండల సీనియర్ నాయకులు అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

## వనపర్తిలో రైస్‌మిల్లర్లపై బుల్‌డోజర్లు

### ప్రభుత్వానికి భారీగా ఎగవేసిన మిల్లులు కూల్చివేత

**వనపర్తి,ఆగస్ట్27 :** వనపర్తి జిల్లాలో సివిల్ సప్లై రంగానికి సంబంధించి నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రభుత్వానికి కోట్లాది రూపాయల బకాయిలు పడిన రైస్ మిల్లులపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు దిగింది. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించి నిర్వహిస్తున్న చాముండి రైస్ మిల్ , సాంబశివ రైస్ మిల్లులను అధికారులు శనివారం కూల్చివేశారు. సివిల్ సప్లైస్ శాఖ, రెవెన్యూ విభాగం, ఇతర అధికారుల ఉమ్మడి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించి బుల్డోజర్లతో మిల్లు నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న మిల్లర్లకు ఈ చర్య ద్వారా అధికారులు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సివిల్ సప్లై బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు ఎంత ప్రయత్నించినప్పటికీ రైస్ మిల్లుల యజమానులు ఏమాత్రం స్పందించలేదు. విచారణలో భాగంగా సాంబశివ రైస్ మిల్ ప్రభుత్వానికి రూ. 13 కోట్ల పైచిలుకు బకాయి పడగా, చాముండి రైస్ మిల్ ఏకంగా రూ. 39 కోట్ల మేర బకాయి పడినట్లు నిర్ధారణ అయ్యింది.

## జివో 97ను రద్దు చేయాల్సిందే : హరీష్ రావు

**హనుమకొండ,ఆగస్ట్27 :** పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకుముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

జనం వార్త

# మంచుకొండల్లో మహా విలయం



నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది.

ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇ ళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉద్ధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టు కుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దు లోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొం ది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. కొండచరి యలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిం దని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది.

పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవిం చినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది.ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంత య్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది. ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పుడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది.

బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగీ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి. ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగీ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది. మధ్యాహ్నం ఒంటిగంటకు చైనా నుంచి నేపాల్‌కు సమాచారం అందింది. టిబెట్ వైపు నదిలో కొండచరియలు విరిగి పడటంతో.. భోటేకోషీ, త్రిశూలి నదులకు ముప్పు ఏర్పడిందనేది దాని సారాంశం. టిబెట్‌లో వరదల గురించి బీజింగ్ ముందుగానే తెలుసుకున్నా.. ఆ విషయాన్ని చేరవేయకపోవడంతో పెను నష్టం వాటిల్లినట్లు నేపాల్ ఆరోపిస్తోంది. అయితే, ఈ విపత్తును చైనాను బాధ్యులను చేయలేమని, ఇరు దేశాల మధ్య ఆ ఒప్పందం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

# నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

**చైనా నిర్మిస్తున్న డ్యామ్‌తో భారత్‌కు ముప్పే**

**బ్రహ్మపుత్రపై చైనా డ్యామ్ ప్రకృతి విలయానికి నాంది**

**ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27 :** నేపాల్ విలయం తరవాత ఇప్పుడు భారత్‌కూ ఇలాంటి ముప్పే పొంచి ఉందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే అది చైనా వల్లనే అని తెలుస్తోంది. బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ డ్యామే. బీజింగ్‌తో మనకు నదీజల వివాద పరిష్కార ఒప్పందాలు, యంత్రాంగం లేవు. బ్రహ్మపుత్రలో ప్రవాహ హెచ్చుతగ్గులు, వర్షపాతం వంటి సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికైతే ఒక అవగాహనా ఒప్పందం ఉంది. దాన్ని అయిదేళ్లకు ఒకసారి పునరుద్ధరించవచ్చు. ఒకవేళ డ్యామ్ నిర్మాణం తర్వాత చైనా దాన్ని పునరుద్ధరించకపోతే.. భారత్‌కు పెను సమస్యగా మారుతుంది. దీనికి తోడు ఈ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో ప్రకృతి విపత్తులకూ ఆస్కారం ఎక్కువే. అందువల్ల భవిష్యత్తులో ఈ నదిలో టిబెట్ వైపు ఏదైనా విపత్తు సంభవిస్తే.. చైనా దాన్ని భారత్‌కు చేరవేయకపోతే ఈశాన్య రాష్ట్రాలు వరదల్లో మునిగే ప్రమాదం ఉంది. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బో అంటారు. ఈ నదిపైనే చైనా ఏకంగా 167 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో భారీ జలవిద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. ఇందుకోసం డ్యామ్ నిర్మాణం చేపడుతోంది. చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా ఇది మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో నీరు రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో పైనుంచి పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా చేయొచ్చు. ఏటా 60వేల మెగావాట్ల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేయగలదని చైనా చెబుతోంది. అయితే, ఈ నిర్మాణ ప్రాంతమే ఇప్పుడు భారత్‌కు సమస్యగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆ మధ్య చైనా జియలాజికల్ సర్వే పర్యవేక్షణలో ఓ అధ్యయనం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అడుగు భాగంలోనే 'పైజెన్ ఫాల్ట్' (పగులు) ఉందని, ఇది అక్కడున్న రాళ్లను చీల్చుతున్నట్లుగా అందులో గుర్తించారు. ఈ బీటలు జల విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో నిర్మించే డ్యామ్‌లు, రోడ్లు, వంతెనలు, సొరంగాల వంటి మౌలిక సదుపాయాలను గణనీయంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల భూకంపాలు సంభవిస్తే ఇక్కడ పరిస్థితిని అంచనా వేయడం కూడా కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై భారత్‌లో కోట్లాది మంది ప్రజల జీవనం ఆధారపడి ఉంది. అస్సాం, అరుణాచల్ రాష్ట్రాల ప్రజలకు ఈ నదే ప్రాణాధారం. మామూలుగానే ఏటా బ్రహ్మపుత్రలో వరదల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు చైనా ఈ డ్యామ్‌ను నిర్మించిన తర్వాత.. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తి మెగా డ్యామ్ నుంచి ఒక్క పెట్టున అపార జలరాశిని విడుదలచేస్తే అది మన ఈశాన్య రాష్ట్రాల్లో విలయం సృష్టించే ప్రమాదం ఉంది. మరోవైపు, డ్యామ్ నిర్మాణం వల్ల బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గిపోయినా పర్యవసానాలు తీవ్రంగానే ఉంటాయి. చైనా దిగువకు నీటికి విడుదల చేయకపోయినా.. నదిలో నీటి లభ్యత తగ్గితే సాగునీటికీ, తాగునీటికీ ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందుకే బీజింగ్ మెగా డ్యామ్ సమస్యను ఎదుర్కొనేందుకు భారత్ కూడా 11వేల మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ నదిలో నిర్మించతలపెట్టిన ఈ డ్యామ్.. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సాయపడుతుంది. కొందరు భూగర్భ శాస్త్రవేత్తలు దీన్ని డ్యామ్ అని కాకుండా 'వాటర్ బాంబ్' అని పిలుస్తున్నారు. చైనా ఆధీనంలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ఈ ఆనకట్ట నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ రీజియన్ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తాయి. ఒకవేళ డ్యామ్ నిర్మించాక భూకంపం ఏర్పడితే భారత్, బంగ్లాదేశ్‌లపై తీవ్ర ప్రభావం పడుతుంది. భూకంపాల కారణంగా భారీ వరదలు ఏర్పడతాయి. అందుకే మైడాగ్ డ్యామ్ భారత్‌కు వాటర్ బాంబ్‌లాగా మారనుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మైడాగ్ డ్యామ్ విషయంలో భారతీయులు మాత్రమే ఆందోళన చెందడం లేదు. చైనా భూగర్భ శాస్త్రవేత్తలూ ఈ ఆనకట్టపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే బ్రహ్మపుత్ర జలాలు చైనా ఆధీనంలోకి వెళ్లిపోతాయి. చైనా జలాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచి ఒకేసారి విడుదల చేస్తే ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వరదలు ఏర్పడతాయి. మరోవైపు సమ్మర్ లాంటి సీజన్లలో చైనా అసలు జలాలనే విడుదల చేయకపోతే నీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈ ముప్పు నుంచి తప్పించుకోవడానికి భారత్ కూడా ఓ మెగా ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిందని సమాచారం.

# నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు

**విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య**

**సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్**



**ఖాట్మండ్, ఆగస్ట్ 27 :** నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది. నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేందని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోలమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాత్మాండూకు పంపింది.

## వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

**భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు**

**వాషింగ్టన్, ఆగస్ట్ 27 :** అమెరికాలో చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని లేదా అక్కడే కెరీర్ కొనసాగించాలని భావిస్తున్న భారతీయులకు మరోసారి అనిశ్చితి ఎదురైంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసి రీషెడ్యూల్ చేయనున్నట్టు అమెరికా తాజాగా ప్రకటించింది. అమెరికా కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసు కున్నాయి .వీసా దరఖాస్తుదారులను మరింత క్షుణ్ణంగా పరిశీలించడం, ముఖ్యంగా వారు అమెరికా ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందా అనే అంశాన్ని అంచనా వేయడంపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ శిక్షణ కోసం కొన్ని వీసా అపాయింట్ మెంట్లను మార్చుతున్నారు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన కొంతమంది దరఖాస్తుదారులకు కూడా అపాయింట్‌మెంట్లు రద్దు చేసి, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని సమాచారం అందించారు ఇటీవలి కాలంలో అమెరికాలో హెచ్-1బీ ఆమోదాల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైగా ఉంది. ప్రస్తుతం అమెరికా యూనివర్సిటీలలో 3,30,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందువల్ల వీసా ఇంటర్వ్యూ తేదీలో ఆలస్యం విద్యార్థుల యూనివర్సిటీ జాయినింగ్ తేదీలను, ఉద్యోగుల జాబ్ ఆఫర్లు, రీలొకేషన్ ప్లాన్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు లేదా హెచ్-1బీ వర్క్ వీసాల జారీని పూర్తిగా నిలిపివేయలేదు. అపాయింట్‌మెంట్ షెడ్యూలింగ్‌లో అంతరాయం మాత్రమే ఏర్పడుతోంది. అమెరికా ఇప్పటికీ భారతీయ విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులకు ముఖ్యమైన గమ్యస్థానంగానే ఉంది. అయితే వీసా స్క్రీనింగ్, హెచ్-1బీ ఖర్చులు, ఎంపిక విధానం, ఎఫ్-1 నిబంధనలు, అపాయింట్‌మెంట్ టైమ్‌లైన్లలో మార్పులు రావడంతో అమెరికా వెళ్లే ప్రణాళిక గతంలో కంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఏర్పడింది.

## నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారిపై ఆరా

**ఏపీ వాసుల క్షేమంపై నారా లోకేశ్ సమీక్ష**

**అమరావతి, ఆగస్ట్ 27 :** నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల క్షేమ సమాచారాలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నేపాల్‌లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల గురించి అడిగి తెలుసుకున్నారు. నలుగురు సురక్షితంగా ఉన్నారని.. మరో ముగ్గురి ఆచూకీ లభ్యం కాలేదని మంత్రికి ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు తెలియజేశారు. కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మిల ఆచూకీ లభించలేదని వెల్లడించారు. కనిపించకుండా పోయిన ముగ్గురి ఆచూకీని కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని లోకేశ్ సూచించారు. చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ చివరిసారిగా కనిపించినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు.. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నా.. క్షేమంగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. సురక్షితంగా ఉన్న వారిని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని మంత్రి లోకేశ్ సూచనలు చేశారు. నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులు, మానస సరోవర్ యాత్రకు వెళ్లిన ఏపీ వాసుల సమాచా రాన్ని ఆర్టీజీఎస్ అధికారులు తెలుసుకుంటున్నారు. మంత్రి లోకేశ్ సూచనల మేరకు ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# రాఖీ పౌర్ణమి..

## అన్నా చెల్లెళ్ల ప్రేమకు ప్రతీక



**హైదరాబాద్, ఆగస్ట్ 27 :** 'రక్ష' అనగా రక్షణ, 'బంధన్' అనగా కట్టడం. సోదరి తన సోదరుని క్షేమంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ చేతికి రాఖీ కడుతుంది. హామీ: సోదరుడు ఎల్లప్పుడూ తనకు అండగా ఉంటానని, రక్షణగా నిలుస్తానని సోదరీమణులకు మాటిస్తాడు. హిందూ చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం, శ్రావణ మాసం పౌర్ణమి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. దీనిని కొన్ని ప్రాంతాలలో 'జంధ్యాల పౌర్ణమి' అని కూడా పిలుస్తారు, ఎందుకంటే ఈ రోజే జంధ్యం ధరించేవారు కొత్త జంధ్యాన్ని మారుస్తారు. హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ వేడుక సోదర, సోదరీమణులకు మధ్య ప్రేమకు గుర్తుగా పేరుగాంచింది. రాఖీ కట్టిన తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రాఖీకట్టి స్వీటు తినిపించి, హారతినిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. శుక్రవారం అక్కాతమ్ముళ్లు ఆనందోత్సవాల మధ్య పండుగను జరుపుకోనున్నారు. ఈ రాఖీ పర్వదినంపై నాటి నుంచి నేటి వరకు అనేక పురాణాలు, కథలు ప్రచారంలో ఉన్నాయి. సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు ఎంతో రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. మార్కెట్‌లో రుద్రాక్ష, స్టోన్, వెండి, బంగారు రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుందన్‌లు, మెరుపులు జరీతో పాటు స్పాంజితో తయారు చేసిన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. పిల్లలను ఆకర్షించేం దుకు కార్టున్ రాఖీలు కూడా వచ్చాయి.పాతకాలంలో అతిపెద్దగా ఉండే రాఖీలు ధరించేవారు. రానురాను అవి చిన్నగా మారిపోయాయి. మళ్లీ ఈ సంవత్సరం మార్కెట్‌లోకి పెద్దపెద్ద రాఖీలు దుకాణాల్లో దర్శనిమిచ్చాయి. ఈనెల 28న సూర్యోదయం నుంచి సూర్యస్తమయం వరకు సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టుకోవచ్చని వేద పండితులు చెబుతున్నారు.



## సాయి ప్రతాప్ రెసిడెన్సిలో విద్యుత్ సమస్య పరిష్కారం

### విద్యుత్ అధికారులకు ధన్యవాదాలు తెలిపిన సాయినాథ్ గౌడ్

**నాగారం,ఆగస్టు 27 (జనంవార్త) :** నాగారం డివిజన్ పరిధిలోని సాయి ప్రతాప్ రెసిడెన్సి కాలనీ వాసులు విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్ విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఏఈ వంశీకృష్ణ స్పందించి సిబ్బందితో గురువారం ట్రాన్స్ ఫార్మర్ ను పరిశీలించారు. అనంతరం క్రొత్త ఫ్యూస్ బాక్స్ ఏర్పాటుచేసి ట్రాన్స్ ఫార్మర్ పైన బుష్ షార్ట్ లను బిగించి, చుట్టుపక్కల ఉన్న మొక్కలను తొలగించి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులకు సిబ్బందికి మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోర్‌మెన్ లక్ష్మణ్ బాబు, లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ నాయక్,నరసింహ, అసిస్టెంట్ లైన్‌మెన్స్ జి. నవీన్ కుమార్,ఎస్ విజయ్ గౌడ్. కాలనీవాసులు పాల్గొన్నారు.



## పోచమ్మ అమ్మవారి అంగరంగ వైభవంగా బోనాల పండుగ

**బిజినపల్లి, వట్టెం, ఆగస్టు 27 (జనం వార్త):** బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలో శ్రీ పోచమ్మ అమ్మవారి నూతన దేవాలయ బోనాల పండుగను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నూతన దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గత మూడు రోజులుగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో యాగాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు, మొలకల బుట్టలు భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం ఉదయం ప్రధాన పూజలు, యాగాలు, హోమాలు నిర్వహించిన అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు సమన్వయంతో కృషి చేశారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.



## పాములు మానవ నేస్తాలు.. పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర

**బిజినపల్లి, ఆగస్టు 27( జనం వార్త):** పాములు మానవులకు శత్రువులు కావని, ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషించే జీవులని ప్రముఖ సర్ప సంరక్షకుడు, వృక్షశాస్త్రవేత్త డా. బి. సదాశివయ్య అన్నారు. బిజినపల్లి మండల కేంద్రంలోని ఆల్ సెయింట్స్ మోడల్ స్కూల్‌లో బుధవారం పాములపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాముల జీవన విధానం, పర్యావరణ పరిరక్షణలో వాటి ప్రాధాన్యతపై డా. సదాశివయ్య అవగాహన కల్పించారు. పాములు ఎలుకల సంఖ్యను నియంత్రించడం ద్వారా రైతులకు ఎంతో మేలు చేస్తాయని, ఆహారపు గొలుసులో అవి కీలక భాగమని వివరించారు. భారతీయ సంస్కృతిలో నాగారాధనకు ఉన్న ప్రాధాన్యతను కూడా విద్యార్థులకు వివరించారు. విషపూరిత, విషరహిత పాములను గుర్తించే విధానం, పాము కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స చర్యలపై అవగాహన కల్పించారు. పాము కాటుకు గురైన వ్యక్తిని మూఢనమ్మకాలతో ఆలస్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా డా. సదాశివయ్య మాట్లాడుతూ.. “పాములు మన శత్రువులు కావు. ప్రకృతి సమతుల్యతను కాపాడే మానవ నేస్తాలు. వాటిని చంపకుండా సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత” అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు జోసెఫ్, రీతూ, డా. సదాశివయ్య పూర్వ విద్యార్థి తిరుపతయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు సీతా అశోక మొక్కలను బహుమతిగా అందజేశారు.

## రోస్టర్ సవరణకు మాల మహానాడు డిమాండ్

### ఆగస్టు 31న 'హలో మాల.. చలో సెక్రటేరియట్'



**దుబ్బాక, ఆగస్టు 27:(జనం వార్త) :** విద్య, ఉద్యోగ రంగాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'హలో మాల.. చలో సెక్రటేరియట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు దుబ్బాకలో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు.మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి కాల్వ నరేష్, రాష్ట్ర నాయకుడు ర్యాకం శ్రీరాములు, పట్టణ అధ్యక్షుడు కాల్వ లింగం ఆధ్వర్యంలో స్థానిక నాయకులు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రోస్టర్ విధానంలో మాలలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రోస్టర్ విధానాన్ని పునఃపరిశీలించి, అర్హత కలిగిన మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో సముచిత న్యాయం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం చేపడుతున్న 'హలో మాల.. చలో సెక్రటేరియట్' కార్యక్రమానికి మాలలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు అస చిన్న ముత్యం,అస ప్రభాకర్,అస రాజేష్,మురళి,స్థానిక ప్రతినిధులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక మున్సిపాలిటీలోని ముసాయిదా ఓటర్ జాబితా పరిశీలన

- ప్రతి ఒక్కరూ ముసాయిదా ఓటర్ జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో పరిశీలించుకోవాలి
- దుబ్బాక ఎమ్మార్వో మోతి సింగ్
- మున్సిపల్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్



**దుబ్బాక, ఆగస్టు 27, (జనం వార్త) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బాక పట్టణంలోని నీలకంఠ భజన మండలిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమగ్ర సవరణ సమావేశానికి దుబ్బాక ఎమ్మార్వో మోతి సింగ్,మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్, వైస్ చైర్ పర్సన్ ఆస సులోచన స్వామి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, బిఎల్ ఓ,బిఎల్ఎలు హాజరై ఓటర్ జాబితాలను పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ..దుబ్బాక మున్సిపాలిటీలోని ప్రతి ఒక్కరూ ము-ఃసాయిదా ఓటర్ జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో పరిశీలించుకోవాలని, అలాగే పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో ఏవైనా తప్పులు లేదా లోపాలు ఉంటే సరిచేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిన వారు, ఓటర్ బదిలీ చేసుకోవాల్సిన వారు సంబంధిత ఫారాలను పూర్తి చేసి తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని వారు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఓటర్ జాబితాలో తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. అనంతరం బిఎల్ఎలు ఎమ్మార్వో మోతి సింగ్,మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్ ను శాలువాలు కప్పి వారు సన్మానించారు.అలాగే బీఎల్ఏ సూపర్‌వైజర్ రవీందర్ కు,బిఎల్ఓలకు ఎమ్మార్వో మోతి సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్, వైస్ చైర్పర్ పర్సన్ ఆస సులోచన స్వామి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఆయా వార్డుల బిఎల్ఎలు శాలువాలు కప్పి వారిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల బిఎల్ఓలు, బిఎల్ఎలు తదితరులు పాల్గొన్నారు.

## కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వేషధారణలో సామల రేణు శ్రీ



**ఆలేరు ఆగస్టు27 (జనం వార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలోని శ్రీ సంతోషిమాత గురు స్థానం 44వ వార్షికోత్సవము సందర్భంగా ఆలేరులో జరిగిన సంస్కృతి కార్యక్రమంలో గురువారం శ్రీ చంద్రకళ నిలయం జనగామ శ్రీ పెరమాండ్ల సంతోష్ మాస్టర్ గారి శిష్య బృంద్యం పేరిణి నృత్యం అత్యద్భుతంగా ప్రదర్శించడం జరిగింది. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రానికి చెందిన సామల సురేష్ వాణి లకుమార్తె చిరంజీవిని సామల రేణుశ్రీ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వర స్వామి వేషధారణలో పేరిణి నృత్యంతో అందరినీ ఆకట్టుకుంది. అలరించింది ఈ సందర్భంగా కుమారి రేణు శ్రీపేరిణి నృత్యానికి అకర్షితులైన పలువురు ప్రజా ప్రతినిధులు దేవాలయ యాజమాన్యం కమిటీ సభ్యులు భక్తులు పలువురు ప్రముఖులు బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపి అభినందించి ఆశీర్వదించారు ఈ సందర్భంగా చిన్నారి రేణు శ్రీ అభినందించి శుభాకాంక్షలు వారందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపింది.ఈ కార్యక్రమంలో చిరంజీవిని రేణు శ్రీ తల్లిదండ్రులు సామల సురేష్- వాణి. శ్రీమన్నారాయణ. మరియు యెంగల్ దాస్ వెంకటేశం స్రవంతి. ఉదయ్ కుమార్. యాదగిరి రమ్య. శ్రీనిధి ,తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు సామల సురేష్- వాణి. శ్రీమన్నారాయణ. మరియు యెంగల్ దాస్ వెంకటేశం -స్రవంతి. ఉదయ్ కుమార్. యాదగిరి .రమ్య. శ్రీనిధితదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ మండలం దొమ్మాటలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు



**దుబ్బాక ఆగస్టు 27(జనం వార్త) :** దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు జరిగాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 22 మంది నాయకులు దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనగామ మల్లారెడ్డి ఆధ్వర్యంలో, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి పార్టీలో చేరిన నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం పార్టీ బలోపేతానికి నిదర్శనమని ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పడాల రాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్వామి, తిరుమలాపూర్ సర్పంచ్ బండారు లాలు, మాచినపల్లి సర్పంచ్ బొక్కల నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ అన్నారెడ్డి సంపత్ రెడ్డి, పడాల మల్లేశం, దాకోల్ల ఆంజనేయులు గౌడ్, సీనియర్ నాయకులు భద్రయ్య తదితర నాయకులు పాల్గొన్నారు..

## ముంపు బాధితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి ,ఆగస్టు 28 :** నీటిపారుదల ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏదుల రిజర్వాయర్ ముంపు గ్రామం బండరావిపాకులకు చెందిన 125 మంది బాధితులకు రూ. 8.33 కోట్ల పరిహారం చెక్కులను కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బండరావిపాకుల, కొంకలపల్లి ముంపు బాధితులకు ప్రభుత్వం రూ. 67 కోట్లు మంజూరు చేసిందని, ఇందులో భాగంగానే నేడు రూ. 8.33 కోట్లు అందజేశామని చెప్పారు. మిగిలిన 50 మందికి బ్యాంకు ఖాతాల సమస్యల వల్ల ఆలస్యమైందని, త్వరలో ఇస్తామన్నారు. ముంపు పునరావాస గ్రామాలైన బండరావిపాకుల, కొంకలపల్లి, నాగరాలలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని, స్థానిక యువత ఉపాధి కోసం అర ఎకరం స్థలం, పర్యాటక శాఖ ద్వారా రూ. 2 కోట్లతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నీటి ట్యాంకులు తదితర సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిహారం వేగంగా విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఖమ్మంలో బీజేపీ ఫైర్ !

- జెడ్పీ సెంటర్‌లో ఉద్రిక్తత.. నేతల అరెస్టుతో వేడెక్కిన రాజకీయ వాతావరణం
- విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది: నెల్లూరి కోటేశ్వరరావు
- బకాయిలు విడుదల చేయకుంటే మంత్రులను రోడ్లపైనే అడ్డుకుంటాం: బీజేపీ హెచ్చరిక

**ఖమ్మం, ఆగస్టు 27:** రాష్ట్రంలోని విద్యాసంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో బీజేపీ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ సెంటర్ వద్ద నిర్వహించిన నిరసనలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి తరలించి అరెస్ట్ చేశారు. నెల్లూరి కోటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో జెడ్పీ సెంటర్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

### 40 లక్షల కుటుంబాలు ఇబ్బందుల్లో: కోటేశ్వరరావు

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యా ఆకాంక్షలను రాష్ట్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం బీజేపీ గత నెల రోజులుగా పోరాటం చేస్తోందని తెలిపారు. బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కళాశాలలకు నిర్వహణ నిధులు అందక విద్యాసంస్థలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. ఫీజులు చెల్లించలేని కారణంగా విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో చదువు పూర్తయిన యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని అన్నారు.

### అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవాలనుకున్న బీజేపీ నాయకులను గృహనిర్బంధాలు, అరెస్టులతో అడ్డుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కోటేశ్వరరావు ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారి భవిష్యత్తును గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులను రోడ్లపై తిరగనివ్వబోమని హెచ్చరించారు. పరిపాలన చేయడం చేతకాకపోతే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి లోకం ఉద్యమిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం యువత ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. తెలంగాణలోనూ అభివృద్ధి, సంక్షేమం కోసం రాజకీయ మార్పు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్యామ్ రాథోడ్, నున్న రవికుమార్, అల్లిక అంజయ్య, కొణతం లక్ష్మీనారాయణ, నకిరేకంటి వీరభద్రం, శ్రీరామనేని మణి, మంద సరస్వతి, శాసనాలు సాయిరాం, పమ్మి అనిత, ఆర్‌వీఎస్ యాదవ్, రుద్రగాని మాధవ్, బి.కొండ శ్యామ్, శ్రీలక్ష్మీరెడ్డి, ఫణికుమారి, స్వర్ణ, భద్రం, గోనెల శివ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

### రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 27(జనం వార్త):** అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాగం నాగేందర్ యాదవ్ కోరారు. ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. గురువారం శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్-2026 (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ నాయక్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సూచనల మేరకు శేరిలింగంపల్లి ఉమ్మడి డివిజన్ ఇన్‌చార్జ్‌లు, బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల్లో మార్పులు తదితర అంశాలపై చర్చించారు. బూత్ స్థాయిలో ఓటర్లకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించే విధంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా బూత్ స్థాయి సిబ్బంది, ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే వాటిని సరిచేయడంతో పాటు, కొత్తగా అర్హత పొందిన వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి ఇన్‌చార్జ్‌లు, బూత్ స్థాయి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యకారులు సురక్షితం

**అమరావతి, ఆగస్టు 27 :** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ కోల్పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. అల్లవరం మండలం నుండి చేపల వేటుకు వెళ్లిన బోటులోని సిబ్బంది అందరూ పశ్చిమ బెంగాల్ లో సురక్షితంగా ఉన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారందరినీ వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. పడవతో పాటు ఆచూకీ కోల్పోయిన ఏడుగురిలో అంతా సురక్షితంగా ఉండడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరం శ్రమించిన గాలింపు బృందాలకు, అధికార యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లిన బోటు సాకేంతిక లోపంతో పనిచేయక, గాలులకు వేరే ప్రాంతానికి కొట్టుకుపోయింది. నిర్ణీత గడువు దాటినా తిరిగి రాలేదనే విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు.. దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. స్వయంగా మంత్రులను పంపి గాలింపును పర్యవేక్షించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్ని మార్గాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఏ మాత్రం నిరాశ చెందకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. కోనసీమ తీరం నుంచి పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండొచ్చనే అంచనాతో పశ్చిమ బెంగాల్ కోస్ట్ గార్డ్ విభాగాలను, అక్కడ స్థానికంగా ఉన్న శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల సహకారాన్ని కూడా తీసుకున్నారు. అన్ని ప్రయత్నాలు ఫలించి శంకర్‌పూర్ సమీపంలో బోటును, అందులోని ఏడుగురు మత్స్యకారులను రక్షించగలిగారు. అలాగే మత్స్యకారుల ఆచూకీ లభ్యమైన వెంటనే ఆ వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

# మంగళగిలో మోడల్ రైతు బజార్

## 5.9 ఎకరాల్లో రూ.18 కోట్లతో ఏర్పాటు

**గుంటూరు, ఆగస్టు 27 :** మంగళగిరిలో మోడల్ రైతు బజార్ నిర్మాణానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. అరబిందో ఫార్మా ట్రస్ట్ రూ. 18 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిడమర్రు రైల్వే గేట్ దగ్గర రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తోంది. మొత్తం 5 ఎకరాల 90 సెంట్ల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో రిటైల్, హోల్‌సేల్ కూరగాయలు, పండ్ల కోసం దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మోడల్ రైతు బజార్‌లో 102 కూరగాయల స్టాళ్లు.. పండ్లు, పూల విక్రయాలకు 54 స్టాళ్లు.. ఇతర వస్తువుల కోసం మరో 60 షాపులు ఏర్పాటుకానున్నాయి.



# నగరపాలక సంస్థ ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలి

- ఎన్నికల ప్రక్రియను మనస్సు పెట్టి పనిచేస్తే సత్ఫలితాలు
- పొరపాట్లు, అలసత్వం వహిస్తే సస్పెన్షన్ తప్పనిసరి
- కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్ష

**ఏలూరు, ఆగస్టు 27 :** స్థానిక నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఏలూరు అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రగతిపై నగర పాలకసంస్థ అధికారులు, సూపర్వైజర్లు, బియల్వో లతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌పై మ్యాపింగు, అనామలీస్, కరేక్షన్లు, ప్రగతిపై అర్బన్ లో 247 పోలింగు బూత్‌లు వారీగా 247 బియల్వో లతో సమీక్షించారు. ఏలూరు అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రగతి చాలా పూర్ గా ఉందని జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. ఈరోజు హాజరుకాని సూపర్వైజర్లు, బిఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చెయ్యాలని, ఇదే పరిస్థితి పునరావతమైతే సస్పెండు చేస్తానని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికలు ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, ఎన్నికల ప్రక్రియను మనస్సు పెట్టి పని చేస్తే మంచిఫలితాలు వస్తాయని అన్నారు. పొరపాట్లు, అలసత్వం వహిస్తే సస్పెండు అవుతారని, తీవ్రత బట్టి ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఉందని ప్రతి ఒక్కరూ గ్రహించాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని మరియు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని, అనర్హులుగా గుర్తించిన వారి వివరాలను పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించుకుని తాగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యతతో, అప్రమత్తంగా, మనస్సు పెట్టి పని చెయ్యాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్, మాపింగు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, బిఎల్వోలకు సీనియరు సూపర్వైజర్లతో మరొకసారి శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఎస్ఐఆర్, ప్రోగ్రామ్, అనామలీస్ లోపాలు, వ్యత్యాసాలు, మాపింగు ప్రక్రియపై సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని అన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం ఎస్ఐఆర్ పనులను వేగవంతం చెయ్యాలని అన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనరు ఏ.భానుప్రతాప్, అడిషనల్ కమిషనరు డి.శ్రీనివాస రావు, అసిస్టెంటు సిటీ ప్లానరు బాబూరావు, తహశీల్దారు యస్.వి. రవీంద్రనాథ్, సూపర్వైజర్లు, బిఎల్వోలు, నగరపాలక సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాల నుండి సొసైటీ భూములను కాపాడండి

- అధ్యక్షులు శ్రీనివాసరావు
- లేఔట్ లో మిగిలిపోయిన స్థలాలపై కబ్జాదారుల కన్ను
- 148 గజాల స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణ పనులు
- కోట్ల విలువైన భూములను కబ్జా చేస్తున్న రియల్టర్లు
- సొసైటీ సిబ్బంది ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారు
- తప్పుడు పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్న బిల్డర్లు
- ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన లేదు






**కూకట్ పల్లి, ఆగస్టు 27, ( జనం వార్త ) :** నగరంలో గజం విలువ లక్షల్లో పలుకుతుండడంతో ఎక్కడ అవకాశం వచ్చిన కబ్జా చేయడానికి కొందరు వెనుకాడడం లేదు. హైటెక్ సిటీకి కూత వేటు దూరంలో ఉన్న ఐడిపిఎల్ వర్కర్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లేఔట్ లో అక్కడక్కడ మిగిలిపోయిన స్థలాలపై కొందరు కబ్జాదారులు తమ అధికార, అర్థ బలాన్ని ఆసరా చేసుకుని స్థలాలను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని హౌసింగ్ సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఐడిపిఎల్ వర్కర్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లో తన 1024హొప్లాటుకు ఆనుకొని మిగిలి ఉన్న 148 గజాల స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణ పనులు చేపడుతున్నారని హౌసింగ్ సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఐడిపిఎల్ వర్కర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు తిరుమల శ్రీనివాసరావు మాట్లాడుతూ కోట్ల రుపాయల విలువైన సొసైటీ భూములను రియల్టర్లు కబ్జాచేస్తున్నారని ఆరోపించారు. సొసైటీ లేఅవుట్ చేసిన సమయంలో మిగిలిపోయిన స్థలాలను కొందరు కబ్జాదారులు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. సర్వే నెంబర్ 145 ఐడిపిఎల్ వర్కర్స్ కోసం 1984లో ఏర్పాటుచేసిన లేఅవుట్ లో


(WRONG)
REGISTRATION PLAN SHOWING FOR THE PLOT BEARING NO. 1024, IN SURVEY NO. 145, ADMEASURING 322.0 SQ.YARDS EQUIVALENT TO 269.23 SQ.METERS, SITUATED AT HYDERNAGAR VILLAGE, KUKATPALLY MANDAL, UNDER GHMC KUKATPALLY CIRCLE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, TELANGANA STATE (FORMERLY KNOWN AS BALANAGAR MANDAL & RANGA REDDY DISTRICT).,
EXECUTANT :
Sri. MOHAMMED ZAKARIA Son of Late. MOHD YOUSUF SAIT,
REF : INCLUDED [ —— ] EXCLUDED [ ]
PLOT NO:- 1025.
THE PLOT NO:-1024
33'-0" WIDE ROAD.
PLOT NO: 1023 & 1022.
NEIGHBOUR'S LAND.
N
WITNESSESS:
1.
2.
SIGNATURE OF THE EXECUTANT
TRUE COPY
Sub-Registrar

మిగిలిపోయిన స్థలాలపై కబ్జాదారుల కన్ను పడిందని, సొసైటీ ఏర్పాటు చేసిన లేఔట్ లో లాటరీ పద్ధతి ద్వారాహొ ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. ప్లాట్ నెంబర్ 1024 ను షేక్ హుస్సేన్ అనే వ్యక్తికి కేటాయించగా 470 గజాలు గలహొప్లాట్ ను హుస్సేన్ పొందినప్పటికి 322 గజాలకు మాత్రమే సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్నారు. 1995 నవంబర్15 న హుస్సేన్ తన 322 గజాల ప్లాట్ ను షేక్ పేట్ కు చెందిన జక్రియకు అమ్మివేశాడన్నారు. హుస్సేన్ చెందిన 322 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ జక్రియ ఆ పక్కనే మిగిలి ఉన్న స్థలాన్ని కలుపుకొని 485 గజాల స్థలంగాహొమార్చుకున్నాడన్నారు. జక్రియ సొసైటీని సంప్రదించి హుస్సేన్ కు 470 గజాలు కేటాయించారని,మిగిలి ఉన్న స్థలాన్ని తనకు రిజిస్ట్రేషన్ చేయాలని కోరాడని,సొసైటీ సభ్యులు అందుకు నిరాకరించారన్నారు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని సంప్రదించిన జక్రియ ప్లాటు కేటాయింపు పత్రాలలో అక్షర దోషం జరిగిందని రిజెస్ట్రేషన్ అధికారులకు నమ్మించి, సెల్ఫ్ రెక్టిఫికేషన్ డీడ్ ద్వారా 485 గజాల స్థలంగా మార్చుకున్నాడన్నారు. ఇట్టి విషయంలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సొసైటీ సభ్యులను సంప్రదించకుండా ఏకపక్షంగా వ్యవహరించి రెక్టిఫికేషన్ డీడ్ ను జక్రియాకు అనుకూలంగాహొచేశారని ఆయనహొఆరోపించారు. 485 గజాల స్థలానికి ఎల్ఆర్ఎస్ కట్టి కట్టడంతోపాటుహొభవన నిర్మాణానికి అనుమతులు తీసుకున్నాడన్నారు. భవన నిర్మాణానికి సొసైటీ సభ్యులు సహకరించకపోవడంతో సొసైటీ పైన కోర్ట్ కు వెళ్ళాడని తెలిపారు. ఓవైపు కోర్టులో కేసు విచారణలో ఉండగా మరోవైపు భవన నిర్మాణ పనులు చేపడుతున్నాడని, కోర్టుకు తప్పుడు పత్రాలు సమర్పించి అనుమతులు పొందడమే కాకుండా మున్సిపల్, పోలీస్ అధికారుల సహకారంతో సంబంధిత నిర్మాణ స్థలంలోకిహొఇతరులకు ప్రవేశం లేకుండా నాట్ టు ఎంటర్ ఆర్డర్ ను తీసుకోవచ్చాడని ఆరోపించారు. ఈ ప్లాట్లలో డెవలప్ మెంట్ నిమిత్తంహొఇద్దరు భవన నిర్మాణదారులకు అప్పగించారన్నారు. సొసైటీ ఉద్యోగి నిర్మాణం జరుగుతున్న ఆ ప్రాంతంలోకి వెళితే అడ్డుకొని సొసైటీ సభ్యులు రావద్దని బెదిరించడంతో పాటు అతని బైక్ కీహొలాక్కుని పంపించేశారన్నారు. సొసైటీ సభ్యులు మున్సిపల్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు జక్రియాకు కోర్టు ఆర్డర్ ఉందని అతనికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు కోర్టులో ఉన్న కేసు పూర్వాపరాలు పూర్తిగా తెలుసుకోకుండా, కోర్టు ఆర్డర్ ఏ విషయంలో ఇచ్చిందోననే విషయాన్ని గ్రహించకుండా కేసులో తుది తీర్పు వెలువడకుండానే కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు.హొ ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిజానిజాలు తెలుసుకొని తప్పుడు పత్రాలతో సొసైటీ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని సొసైటీ భూమిని కాపాడాలని ఐడిపిఎల్ వర్కర్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు, సొసైటీ సభ్యులు కోరుతున్నారు.




– రాము సామల
939 939 6555

# మహిళా రక్షణపై నమ్మకమైన సాధనం శక్తి యాప్

- శక్తి యాప్ ఉపయోగాలపై అవగాహన
- సైబర్ నేరాలపై విద్యార్థిని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలంటూ సూచన



**ఏలూరు, ఆగస్టు 27 :** జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ యొక్క ఆదేశాలపై ఏలూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీవారపుపేటలో ఉన్న మున్సిపల్ హైస్కూల్లో గురువారం విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలు శక్తి యాప్ ఉపయోగాలపై శక్తి టీం సభ్యులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు టూ టౌన్ మహిళా ఎస్ఐ నాగ కళ్యాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగ కళ్యాణి మాట్లాడుతూ శక్తి యాప్ మహిళా భద్రతకు సంబంధించిన అత్యవసర స్పందన మొబైల్ అప్లికేషన్. దీనిని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అభివృద్ధి చేసిందని, ఇది ముఖ్యంగా మహిళలు, బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించేందుకు రూపొందించబ డింది అని చెప్పారు. ఏది అయినా అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌ను ఉపయోగించిన ఎడల లేదా డయల్ 112 కు సమాచారం అందించిన ఎడల సమీప శక్తి టీం గస్తీ బృందం తక్షణమే తమ వద్దకు చేరుకోగలరాని చెప్పారు. ఈ యాప్ ద్వారా మహిళలు రాత్రి పూట లేదా ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు భద్రతగా ఉంటుందన్నారు..శక్తి యాప్ లో మహిళల హక్కులు, చట్టాలు, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ లు మొదలైన సమాచారం లభిస్తుందని చెప్పుకొచ్చారు. సైబర్ నేరాలు, వేధింపులు వంటి వాటి గురించి కూడా అవగాహన కల్పించారు. హెల్ప్ లైన్ నెంబర్ లను 24 గంటలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. 112 ఎమర్జెన్సీ నెంబర్ మహిళా హెల్ప్ లైన్ వంటి నెంబర్లను నేరుగా యాప్ నుండి కాల్ చేయవచ్చని అన్నారు ముఖ్యంగా... వేధింపులు, కిడ్నాప్ ప్రయత్నం, గృహ హింస, రహదారిలో ఒంటరిగా ప్రయాణం, అనుమానాస్పద వ్యక్తుల ప్రవర్తనపై శక్తి యాప్ ఒక ఆత్మ విశ్వాసానికి కలిగి ఉంటాడడానికి నిదర్శనమన్నారు. మహిళలు ఎక్కడ ఉన్నా సురక్షితంగా ఉండేందుకు పోలీస్ శాఖ తీసుకున్న అద్భుతమైన చర్యగా పేర్కొన్నారు. ప్రతి మహిళా తమ ఫోన్ లో ఈ యాప్ తప్పనిసరిగా ఉంచుకోవాలి అని ఎస్సై నాగ కళ్యాణి తెలియ చేసారు. అదేవిధంగా సైబర్ నేరాలు ప్రస్తుతం ఎక్కువ అయ్యాయని, ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి, విద్యార్థులు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. మొబైల్ లకు అన్నోన్ నెంబర్ల నుంచి లింకులు రావడం పరిపాటిగా మారిందని ఆ లింకులు ఓపెన్ చేసిన ఎడల మన బ్యాంక్ అకౌంట్ లను హ్యాక్ చేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా ఫోన్లో అనుమానిత వ్యక్తులు ఎవరైనా డింకులు గానీ మెసేజ్లు గాని పంపించిన ఎడల వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దని సూచించారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో 98.47% పూర్తి

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి, ఆగస్టు 27 :** హెచ్‌పీవీ టీకా (వ్యాక్సిన్) పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా 98.47 శాతం పూర్తయినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ బారి నుంచి సంరక్షించే చర్యల్లో భాగంగా ఈ వ్యాక్సిన్‌ను 14-15 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలకు ఉచితంగా అందచేస్తున్నామని చెప్పారు. స్వర్ణ (గ్రామ/వార్డు లెక్కల ప్రకారం ఈ ఏడాది మార్చి నాటికి 14 ఏళ్లు వచ్చి 15 ఏళ్లు దాటని బాలికలు 3,45,377 మంది ఉండగా వీరిలో గురువారం మధ్యాహ్నం నాటికి 3,40,108 మంది (98.47%)కి వ్యాక్సిన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన 5,269 మంది బాలికలకు ఈ నెల 31లోగా వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం ద్వారా మొదట్లో ఉన్న అపోహలు దూరం కావడంతో తమ కుమార్తెలకు వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారని మంత్రి పేర్కొన్నారు. తొలుత ఆగస్టు చివరి నాటికి నిర్దేశించిన వారికి వ్యాక్సిన్ పంపిణీ పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 98.47% మేర పురోగతి సాధించడం విశేషం. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో వ్యాక్సిన్ పంపిణీ తక్కువగా ఉందన్న ఉద్దేశంతో డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం గురువారం సమాచారాన్ని పంపించింది. అలాగే 14 ఏళ్లు నిండిన బాలికలకు కూడా వ్యాక్సిన్ ఇచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం త్వరలో 1,90,890 డోసుల వ్యాక్సిన్ ను రాష్ట్రానికి పంపించబోతుంది.

14 ఏళ్ల బాలికలు తల్లిదండ్రులతో కలిసి నేరుగా పీహెచ్సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు వెళ్లాలనిఅధికారులు సూచించారు. వ్యాక్సిన్ పంపిణీ పురోగతిని అనుసరించి కేంద్రం రాష్ట్రానికి తగిన ప్రాధాన్యనీ ఇస్తోంది. ఈ వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభమైన అనంతరం రెండు దపాలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780 డోసులు రాష్ట్రానికి అందాయి. దీనికి సమర్థంగా సద్వినియోగం చేసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. డిసెంబరు 31 అనంతరం హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీని రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో జతచేస్తారు.




# రోడ్డెక్కిన శానిటేషన్ వర్కర్స్

## పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలంటూ ధర్నా

### మోకాళ్లపై నిల్చుని నిరసన

**ఏలూరు, ఆగస్టు 27 :** ఏలూరు జిల్లా కలక్టరేట్ వద్ద ఏ పి ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల్లో పనిచేసే శానిటేషన్ కార్మికులు గురువారం రోడ్డెక్కారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసారు. కార్మికులు మోకాళ్ళ పై నిల్చుని ధర్నా చేశారు. జిల్లాలో 1900 మంది కార్మికులకు సుమారు 4.5 కోట్ల రూపాయలు బకాయిల కింద రావాల్సి ఉందని పేర్కొన్నారు. కనీస సౌకర్యాలు లేవని మొరపెట్టుకున్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించడం తోపాటు గ్లౌజ్‌లు మాస్క్ లు ఇవ్వాలని, ప్రమాదం భీమా, ఈ ఎస్ ఐ సౌకర్యం కల్పిస్తూ ఏడాదికి రెండు జతల యూనిఫారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం సీఐటియు ఆధ్వర్యంలో సాగింది.



# నలుగురు ఏపీ యాత్రికులు సురక్షితం

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి, ఆగస్టు 27 :** కైలాస మానససరోవర యాత్రలో ఉన్న కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన నలుగురు ఏపీ యాత్రికులు చైనాలోని హోటల్‌లో సురక్షితంగా ఉన్నారన్నారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్. మీడియాతో మాట్లాడుతూ...వీళ్లతో ఏపీ ఎన్ఆర్టీ అధికారులు మాట్లాడుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చొప్పుకొచ్చారు. పరిస్థితి చక్కబడిన వెంటనే వారిని రెస్క్యూ టీం సురక్షితంగా తీసుకువస్తుందని భరోసా ఇచ్చారు. భారీ వర్షాలు, వరదల వల్ల రోడ్డు మార్గం తీవ్రంగా దెబ్బతిందన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన సుహాసిని రెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన రమేష్‌బాబు, కాకినాడ జిల్లాకు చెందిన మరో ఇద్దరు పర్యాటకులతో పాటు బాలసుబ్రహ్మణ్యం అనే వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు. నేపాల్, చైనా సరిహద్దుల్లో చిక్కుకున్న యాత్రికుల భద్రతపై మంత్రి నారా లోకేష్ నిరంతర పర్యవేక్షణ చేస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు.

# మిడ్, సీనియర్ ఉద్యోగులకు టీసీఎస్ షాక్

## వేరియబుల్ పేలో కోత




ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్.. మిడ్, సీనియర్ లెవల్ ఉద్యోగులకు షాకిచ్చింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గానూ క్వార్టర్లీ వేరియబుల్ పేలో కోత పెట్టింది. సగటున 60-70 శాతం మాత్రమే వేరియబుల్ పే చెల్లించినట్లు సమాచారం. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ 'మనీ కంట్రోల్' ఆ వివరాలను వెల్లడించింది. మార్జిన్ ఒత్తిడులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడుల వేళ టీసీఎస్ వేరియబుల్ పేలో కోత పెట్టినట్లు తెలుస్తోంది. గడిచిన రెండు త్రైమాసికాల్లో సగటున 80 శాతం చొప్పున వేరియబుల్ పేను టీసీఎస్ చెల్లించింది. దాంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కాస్త తక్కువగా చెల్లించింది. అయితే, 2025-26 తొలి త్రైమాసికానికి రెండేళ్ల ముందు వరకు సగటున 20-40 శాతం మాత్రమే వేరియబుల్ పేగా చెల్లించడం గమనార్హం. దాంతో పోలిస్తే ఈ మొత్తం అధికమని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మూడేళ్ల క్రితం నూరుశాతం వేరియబుల్ పే అందుకొనే వాడినని, ఇప్పుడు దాదాపు 30-35 శాతం మేర కోత పడిందని ఓ సీనియర్ లెవల్ ఉద్యోగి పేర్కొన్నారు.






## ఈ10, ఈ20 పెట్రోల్‌పై డిబేట్..

ఈ20 స్థానంలో మళ్లీ ఈ10 పెట్రోల్‌ను తీసుకురావడంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ స్పష్టంచేసింది. పాత వాహనాలకు తక్కువ ఇథనాల్ మిశ్రమం ఎలా అందుబాటులో ఉంచాలి? సుదీర్ఘ ఇంధన సరఫరా వ్యవస్థ కలిగిన దేశంలో అదనపు గ్రేడ్ పెట్రోల్‌ను ఎలా సరఫరా చేయొచ్చనే అంశపైనే ప్రస్తుతం చర్చ జరుగుతోందని తెలిపింది. ఈ మేరకు కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ఖన్నా మీడియాతో మాట్లాడారు. ఇథనాల్ బ్లెండింగ్ పాలసీని మార్చి ఈ20 నుంచి ఈ10కు మారడం వల్ల ఆపరేషనల్, లాజిస్టిక్ సవాళ్లు ఎదురుకాబోవని ఖన్నా తెలిపారు. అలాగని ఈ20 స్థానంలో ఈ10ను తీసుకొస్తారని తన ఉద్దేశం కాదన్నారు. పాత వాహనాల కోసం ఈ10 ఉండాలనే అంశంపై చర్చ నడుస్తోందన్నారు. ఒకవేళ ఈ20తో పాటు ఈ10 పెట్రోల్ కూడా అందించాల్సి వస్తే.. ప్రస్తుత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందుకు పెద్ద సమస్య కాబోదన్నారు. అయితే, అదనపు గ్రేడ్ పెట్రోల్ రవాణా విషయంలో కొన్ని సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దేశంలో అతిపెద్ద చమురు డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఉండడమే దీనికి కారణమన్నారు. దేశంలో గత కొన్ని రోజులుగా ఈ20పై పెద్దఎత్తున చర్చ నడుస్తున్న సంగతి తెలిసిందే. దీనివల్ల తమ వాహనాలు పాడైపోతున్నాయని, మైలేజీ కూడా పడిపోతోందంటూ కొందరు వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలోనే పెద్ద సంఖ్యలో ఉన్న పాత వాహనాల కోసం తక్కువ ఇథనాల్ కలిగిన పెట్రోల్ వేరియంట్ కూడా అందుబాటులో ఉండాలంటూ ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ సూచించారు. ఈ20తో పాటు, ఈ10 పెట్రోల్ కూడా ఉండాలని అభిప్రాయపడ్డారు. అయితే, రెండు రకాల పెట్రోల్ వేరియంట్లను పెట్రోల్ బంకుల్లో విక్రయించడం, సరఫరా చేయడం సవాలుతో కూడుకున్న వ్యవహారం అని గతంలో పెట్రోలియం మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# డ్రాగా ముగిసిన రెండో టెస్టు

## శ్రీలంక అద్భుత పోరాటం

భారత్ - శ్రీలంక జట్ల మధ్య రెండో టెస్టు డ్రాగా ముగిసింది. మరో 18 ఓవర్ల ఆట మిగిలి ఉండగానే ఇరు జట్లూ డ్రాకు అంగీకరించాయి. ఇప్పటికే శ్రీలంక 216 పరుగుల ఆధిక్యం ఉండటంతో మ్యాచ్ ఫలితం తేలే అవకాశం లేదు. దీంతో డ్రా అయినట్లు భారత్ - శ్రీలంక ఆటగాళ్లు కరచాలనం చేసుకున్నారు. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0 ఆధిక్యంతో సొంతం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోరు 503/9 డిక్లేర్డ్.. శ్రీలంక 290 పరుగులకు ఆలౌట్. రెండో ఇన్నింగ్స్‌లో 429/9. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సోనాల్ దినుష (103, 133) సెంచరీలు సాధించాడు.




తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోరు చేసింది. శ్రీలంకను 290 పరుగులకే ఆలౌట్ చేసింది. ఫాలో ఆన్ ఆడించింది. ఓవర్‌నైట్ 229/6 స్కోరుతో ఐదో రోజు ఆట మొదలైంది. ఇంకెంతసేపు లంక ప్రయాణం ఉంటుందిలే అనుకొని భారత అభిమానులు భావించి ఉంటారు. తొలి సెషన్‌లో ఎలాగూ బౌలింగ్‌కు సహకారం లభిస్తుంది కదా.. త్వరగా ఆలౌట్ చేసేసి చకచకా మిగిలిన ఆ కాసిని పరుగులు ఛేదించి 2-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేద్దామని భారత జట్టూ అనుకొంది. కానీ.. సోనాల్‌కు అండగా.. మనకు కొయ్యగా మారిన కేశర నువాంత (46: 150 బంతులు) దాదాపు 40 ఓవర్లపాటు వికెట్ పడనీయకుండా అడ్డుగా నిలిచాడు. ఐదో రోజు తొలి సెషన్‌లో వికెట్ దక్కలేదు. హమ్మయ్య.. దాదాపు 40 ఓవర్ల తర్వాత నువాంత ఔటయ్యాడులే అని అభిమానులు సంబరపడ్డారు. ఇతడంటే స్పిన్‌ఆల్‌రౌండర్ కదా అని అప్పటికి సరిపెట్టుకొన్నారు. అప్పటికి సెంచరీ హీరో సోనాల్ దినుష కాకుండా.. ఇక మిగిలిన ముగ్గురూ ప్రధాన బౌలర్లు. బ్యాటింగ్ పెద్దగా రాదు. కాస్త రెచ్చగొడితే వికెట్ తీసేయచ్చని భారత్ ప్లాన్. ప్రభాత్ జయసూర్య (2: 28 బంతుల్లో) విషయంలో వర్కౌట్ అయింది. కానీ, మన ప్రణాళికలను పారనీయకుండా చేశాడు లాహిరు కుమార. అతడు చేసిన పరుగులు కేవలం 12 మాత్రమే. కానీ, ఆడిన బంతులు ఏకంగా 90 కావడం గమనార్హం. సోనాల్‌తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. అదీనూ 28 ఓవర్లను కాచుకొని మరీ. అప్పటికే శ్రీలంక ఆధిక్యం 200కి చేరువగా వచ్చింది. సరే.. చివరి సెషన్‌లోనైనా టీ20లా ఆడి మ్యాచ్‌ను మనవైపు లాగేసుకుందాం.. వార్మప్ మ్యాచ్‌లో అలాగే చేశాం కదా.. అని కాస్త సంబరపడేలోపే అసిత ఫెర్నాండో (0: 24 బంతుల్లో) నాలుగు ఓవర్లు వృథా చేశాడు. మరోవైపు సోనాల్ దినుష (133: 264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులు) టీమ్‌ఇండియా బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. దీంతో మూడో సెషన్ కూడా నెమ్మదిగా కరిగిపోవడం మొదలైంది. లంక ఆధిక్యం 200 పరుగులు దాటేసింది. ఇక మహా అయితే 18 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడే అవకాశం ఉండటం.. లక్ష్యం కూడా పెద్దది కావడంతో ఇరు జట్లూ డ్రా చేసుకునేందుకు అంగీకరించాయి. ఈ మూడు గండాలను దాటడంలో విఫలం కావడమే భారత్‌కు విజయం దూరమైంది. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 154 ఓవర్లు ఆడి 429/9 స్కోరు వద్ద నిలిచింది. సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానానికి చేరుకుందామనుకుంటే.. మన పర్సంటేజీ కూడా తగ్గిపోయి (53.33 నుంచి 51.52 శాతం) ఐదో స్థానంలోనే నిలిచింది.






## జన్ ధన్ ఖాతాల్లో రూ.3.17లక్షల కోట్లు

దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్-ఆధార్- మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి.

# సగం క్రీడల్లో ప్రాతినిధ్యమే లేదు

## ఇది చేదునిజం: ప్రధాని మోదీ



క్రీడల ద్వారా జీవితాలు ఎలా మారిపోతాయనే దానికి పారా అథ్లెట్లే ప్రత్యక్ష ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం జాతీయ క్రీడా దినోత్సవం నేపథ్యంలో నేడు 'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమం జరిగింది. వందలాది మంది అథ్లెట్లు, విద్యార్థులు, వాలంటీర్లతో ప్రధాని వర్చువల్‌గా మాట్లాడారు. ఒలింపిక్స్‌లోని సగం విభాగాల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యమే లేదని గుర్తు చేశారు. ఆ విషయంలో మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. "ఒలింపిక్స్‌లో చాలా క్రీడాంశాలు ఉంటాయి. అందులో సగం క్రీడల్లో భారత అథ్లెట్లు పాల్గొనడం లేదు. పతకాలు ఎక్కువగా వచ్చే విభాగాల్లో మనం ఆడట్లేదు. ఇది దశాబ్దాలుగా జరుగుతోంది. 2012లో మనం కేవలం 13 క్రీడల్లోనే తలపడ్డాం. మరో 20 ఈవెంట్స్‌లో అడుగే పెట్టలేదు. అందులో కొన్ని పోటీలు ఎలా ఉంటాయో కూడా దేశంలోని చాలా మందికి తెలియదు. ఇది వినేందుకు కఠినంగా ఉన్నా.. చేదునిజం. ఇతర దేశాల ప్లేయర్లు అందులోనే ఎక్కువగా పతకాలు సాధిస్తున్నారు. ఒలింపిక్స్‌లో మన పతకాల సంఖ్య పెరగాలంటే ఈ క్రీడల్లోనూ ప్రాతినిధ్యం ఉండాలి" అని మోదీ తెలిపారు.

**2028 ఒలింపిక్స్‌లో...** ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో సర్ఫింగ్, స్పోర్ట్ క్లైంబింగ్ పోటీల్లో భారత్ నుంచి ఎవరూ పాల్గొనలేదు. ఈ రెండింటిని ఉదహరిస్తూ ప్రధాని మాట్లాడారు. "మనకు అద్భుతమైన కోస్తా తీరం ఉంది. అలాగే కొండ ప్రాంతాలూ ఉన్నాయి. సహజ సిద్ధంగానే వనరులు ఉన్నప్పుడు ఇలాంటి క్రీడల్లో మన ప్రాతినిధ్యం పెరగాలి. అప్పుడే పతకాలను ఎక్కువ సాధించేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి" అని ప్రధాని సూచించారు. 2028లో లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో మరిన్ని ఈవెంట్లలో పాల్గొనేలా చూడాలని ఇప్పటికే అథ్లెట్లకు మోదీ దిశానిర్దేశం చేశారు. "ఒక అథ్లెట్ సక్సెస్ అయితే.. కేవలం వారి వరకే ఆ ఫలితాలు ఉండవు. కుటుంబం, పాఠశాల, కళాశాల, జిల్లా, రాష్ట్రం, దేశం గురించి ప్రపంచం మొత్తం తెలుసుకుంటుంది. అందుకు పారా అథ్లెట్ల జీవితమే ప్రత్యక్ష ఉదాహరణ. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వీరంతా నాలో స్ఫూర్తి నింపారు" అని మోదీ వెల్లడించారు.

# కివీస్-భారత్ సిరీస్

## హాట్‌కేకుల్లా అమ్ముడైన ప్రి-సేల్ టికెట్లు




**టీమ్‌ఇండియా ఎక్కడ ఆడితే అక్కడ కాసుల వర్షం అనేందుకు ఇదొక ఉదాహరణ. మరో రెండు నెలల్లో భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. మూడు ఫార్మాట్లలోనూ సిరీస్‌లు ఆడనుంది. ఇరు జట్లూ ఐదు వన్డేలు, ఐదు టీ20లు, రెండు టెస్టుల్లో తలపడనున్నాయి. మొత్తం 12 మ్యాచులు ఐదు వేదికల్లో జరుగుతాయి. ఈ క్రమంలో కివీస్ జట్టు ప్రిసేల్ ద్వారా అక్కడి అభిమానుల కోసం టికెట్లను అందుబాటులోకి తెచ్చింది. అయితే, కేవలం 48 గంటల్లోనే 26వేల టికెట్లు అమ్ముడవ్వడం విశేషం.**

అక్టోబర్‌లో టీ20 సిరీస్‌తో న్యూజిలాండ్ పర్యటన మొదలవుతుంది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా తొలి రెండు టీ20లు జరుగుతాయి. ఈ మైదానం కెపాసిటీ 9వేలు మాత్రమే. టీ20లతోపాటు ఓ టెస్టు మ్యాచ్ కూడా జరగనుంది. మిగతా మూడు మ్యాచులు వెల్లింగ్టన్, ఆక్లాండ్, హామిల్టన్ మైదానాల్లో జరుగుతాయి. పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌ల కోసమే కాకుండా టెస్టులను చూసేందుకూ డిమాండ్ ఉందని కివీస్ చీఫ్ మార్కెటింగ్, కమర్షియల్ ఆఫీసర్ గ్లెన్ క్రిచ్‌లే తెలిపారు. "తొలి రెండు రోజుల్లోనే రికార్డు స్థాయిలో సేల్స్ నమోదయ్యాయి. భారత్ వంటి పెద్ద జట్టుతో ఆడే మ్యాచులను వీక్షించే అవకాశం కివీస్ అభిమానులకు చాలా అరుదుగానే వస్తుంటుంది. గత సీజన్ మాదిరిగానే ఈసారి కూడా టికెట్ల ధరలను అందుబాటులోనే ఉంచాం. నేషన్ యాక్సెస్ కోడ్ వినియోగించుకోవడం ద్వారా ఇక్కడి అభిమానులకు 30 డాలర్ల కంటే తక్కువకే టికెట్ రానుంది. ముందస్తు సేల్‌లో ఫ్యాన్స్ నుంచి మంచి ఆదరణ లభించడం ఆనందంగా ఉంది. సెప్టెంబర్ 7 నుంచి సాధారణ టికెట్లను అందుబాటులోకి తీసుకొస్తాం" అని గ్లెన్ వెల్లడించారు.




## భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు

### సెన్సెక్స్ 539 పాయింట్లు డౌన్

**ముంబాయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నా.. ఎక్స్‌పైరీ సెషన్ కావడంతో సెన్సెక్స్ భారీ నష్టాల్లోకి జారుకుంది. ముఖ్యంగా మెటల్, పీఎస్‌యూ, సిమెంట్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. హిందాల్కో ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,100 పాయింట్ల దిగువకు చేరింది. ఉదయం 77,576.76 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,472.94) లాభాల్లో ప్రారంభమైన సూచీ.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,933.59 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరకు 539.35 పాయింట్లు పతనమై 76,933.59 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 116.90 పాయింట్లు కోల్పోయి 24,090.85 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.54గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో కోటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, బీఈఎల్, అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్ తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 88.21 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,581.90 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

జనం వార్త




# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో

అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ దేవోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.

# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్

## భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత



కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ. 2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది. ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది. 'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ. 100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.



# రణబలి రిలీజ్ అక్టోబర్ 16కు మార్పు

రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు. తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. 'రణబాలి'ని సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. 19వ శతాబ్దం నేపథ్యంలో కథ సాగుతుంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలో 1854 నుంచి 1878 మధ్య జరిగిన చారిత్రక పరిణామాలను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాలో ఇంతకుముందెన్నడూ చూడని విధమైన పాత్రలో కనిపించనున్నారని టాక్. పీరియాడిక్ ప్రపంచం, భారీ యాక్షన్ సన్నివేశాలు, అప్పటి కాలానికి సంబంధించిన సెట్స్, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది.

# సినిమా విజయం చిత్ర పరిశ్రమలో అందరికీ పండగే

## ఇరుడుముడికి చిరంజీవి ప్రత్యేక అభినందనలు







ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది 'ఇరుముడి'. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఈ హిట్ సినిమాపై రివ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒక సినిమా విజయం సాధిస్తే పరిశ్రమలో అందరికీ పండగే అని చెప్పిన చిరు.. 'ఈ పరిశ్రమ అందరిది.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి' అని పేర్కొన్నారు. ఇక 'ఇరుముడి' చిత్రబృందానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన సోదరుడు రవితేజకు అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించా. రవితేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా బాధ్యతను దర్శకుడు శివ నిర్వాణ తన భుజాలపై వేసుకుని గొప్పగా తీర్చిదిద్దారు. సున్నితమైన భావోద్వేగాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. బాలనటి నక్షత్రకు గొప్ప భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా. 'ఇరుముడి'లో భాగమైన నటీనటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ప్రత్యేక అభినందనలు' అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ చిత్ర విజయం అర్హమైనదని పేర్కొన్నారు. చిరు పోస్ట్‌పై రవితేజ స్పందించారు. 'అన్నయ్యా థాంక్యూ..' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించి కృతజ్ఞతలు చెప్పారు. విడుదలైన నాటి నుంచి థియేటర్స్ హౌస్ ఫుల్‌తో కళకళలాడుతుండగా, ఆరో రోజు కూడా అదే జోరు కొనసాగింది. కొన్ని థియేటర్ లలో ప్రస్తుతం ఉన్న సినిమాను తీసేసి 'ఇరుముడి' వేయాలంటూ పలువురు ప్రేక్షకులు ఆందోళన చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల సీట్లు సరిపోక కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొన్ని హాళ్లలో ఏకంగా భజనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ

## రంగస్థలంను మించి ఉంటుందంటూ ప్రచారం



టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.

# 'అలియాస్ రుక్మిణి' చిత్రంలో రుక్మిణి వసంత్

'సప్త సాగరాలు దాటి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన కన్నడ భామ రుక్మిణి వసంత్, తొలి సినిమాతోనే తెలుగు, కన్నడ ప్రేక్షకుల్లో ఊహించని క్రేజ్ సంపాదించుకున్నారు. తన నటనతో, అందంతో కుర్రకారును మంత్రముగ్ధులను చేసిన ఈ భామ, ఇటీవల వచ్చిన 'కాంతార: చాప్టర్ 1' ఘనవిజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ 'టాక్సిక్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తూ వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే.. తాజాగా, రుక్మిణి వసంత్ ఖాతాలో మరో బిగ్ ప్రాజెక్ట్‌లో చేరినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. నితిన్ హీరోగా నటిస్తున్న 'అలియాస్ రుక్మిణి' చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాను నాచురల్ స్టార్ నాని తన సొంత నిర్మాణ సంస్థ యూనానిమస్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. మురళీకాంత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సినిమా ప్రకటన సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన ప్రత్యేక వీడియో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోవడమే కాకుండా సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. అతి త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభం కానుందని సమాచారం. వరుస సక్సెస్‌లతో టాప్ ఫామ్‌లో ఉన్న రుక్మిణి వసంత్, నితిన్, నాని కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com